కథ

# వర్షం



**విస్సర్తి ప్రణవమూర్తి**

ఆరోజు ప్రక్క మంచం మీదకు నడివయసులో ఉన్న ఒక సన్నకారు రైతు చేరాడు.

"ఏం పేరు బాబు నీది" అడిగాడు

"ఈరన్న బాబు" బదులిచ్చాడు

"ఏ ఊరు"

"రామచంద్రపురం పైన చెల్లూరు బాబు"

"ఏంటి నీ బాధ"

"కడుపు నొప్పి బాబు. కడుపులో కంతి పెరుగుతుందంట. ఆపరేషన్ చేసి దాన్ని తీసేయాలట బాబు. మా ఊరి సర్పంచి చౌదరిగార్కి ఈ డాక్టరుగారు తెలుసంట. ఆయనే నన్ను తీసుకొచ్చి అడ్మిషన్ చేయించారు బాబు" మిగిలిన వివరాల్ని చెప్పాడు వీరన్న.

రోహిణి కార్తె మండుటెండలు. వారంరోజులు గడిచాయి. ప్రతిరోజూ పెద్ద డాక్టర్లు, చిన్న డాక్టర్లు పిల్ల డాక్టర్లూ అందర్నీ పరీక్ష చేస్తున్నట్లుగానే వీరన్న కడుపుని కూడా నొక్కి, పరీక్ష చేస్తున్నారు. ప్రతిరోజూ నేర్చుకునే మెడికల్ స్టూడెంట్లు గట్టిగా కడుపు నొక్కేస్తున్నప్పుడు వచ్చే నొప్పికి వీరన్న తట్టుకోలేక పోతున్నాడు.

"బాబూ నన్నొగ్గేయండి, మీరంతా నా కడుపుని నొక్కి పిసికేస్తుంటే కడుపంతా నొప్పెట్టేస్తుంది. మీకు దణ్ణం పెడతా" వాళ్లని పరీక్ష చేయనీయకుండా ముడుచుకుపోయి మొరాయించేస్తున్నాడు.

తెల్లగా ఎత్తుగా పూర్తి చేతులు ఓవర్‌కోటు వేసుకొని రోజూ ఉదయమే పరీక్ష చేసే డాక్టరు తుకారాంను మాత్రం ఏమీ అనేవాడు కాదు వీరన్న. ఎందుకంటే అతను నెమ్మదిగా పరీక్ష చేసేవాడు. నొప్పంటే సూదిమందెక్కించేవాడు. అతని చుట్టూ అందమైన సిస్టరు పిల్లలు కూడా నవ్వుతూ తిరిగేవారు. అందగాడనేమో.

ఆరోజు బొద్దుగా ఓవరు కోటు లేకుండా అసిస్టెంట్లతో ఛీఫ్ (పెద్ద)డాక్టరుగారి రౌండ్స్‌కి వచ్చారు. ఆయన ఆపరేషన్లు చేస్తూ ఉండటం వలన పిల్లలకి పాఠాలు చెప్పుతూ ఉండటంవలన వారానికి ఒకటి లేక రెండు రోజులు మాత్రమే పేషెంట్లను పలకరించేందుకు వార్డుకొచ్చేవారు. ఆ నాల్గు జిల్లాలకు ఆయనే సమర్థుడైన పెద్ద డాక్టరు.

వరసగా పేషెంట్లను చూసుకుంటూ వీరన్న దగ్గరకొచ్చారు.

"ఎలాగుంది వీరన్న నీకు" అడిగారు పెద్ద డాక్టరు. వీరన్న మాట్లాడలేదు.

"ఏదీ చొక్కా ఎత్తు చూద్దాం" అన్నారు పెద్దడాక్టరు.

వీరన్న ఆయన్ను ఎగాదిగా చూసి ముఖాన్ని సీరియస్‌గా పెట్టి

"చాల్లెండి బాబు, ఎంతమందికి చూపించను? కడుపు నొక్కేస్తున్నారు. నొప్పెక్కువయిపోతంది. పొద్దున్నే పెద్ద డాక్టరు చూసార్లెండి. ఆయనకు చెప్పుకున్నాను నా బాధలన్నీ"

"అరే! వీరన్నా ఈయనే పెద్ద డాక్టరుగారు. ప్రొద్దున్న చూస్తున్నాయన హౌస్‌సర్జన్ మాత్రమే" నెమ్మదిగా ప్రక్కమంచం మీద నుండి చెప్పినా, అతను వినిపించుకోలేదు.

పెద్దడాక్టరు పకాలున నవ్వి,

"ఇతను తుకారాంకి చూపించుకున్నట్లున్నాడు" అనుకుంటూ ముందుకు సాగిపోయారు.

అంతా వెళ్లిపోయిన తరువాత అసలు విషయం చెప్పాను, వీరన్నకి.

ఆశ్చర్యంగా, "అయితే ఈయనే పెద్ద డాక్టరా! నేను ఆ పొడిగాయినే పెద్దోడను కున్నాను. అయ్యబాబోయి ఎంత తప్పయి పోయింది" భయపడిపోయాడు.

ఎండలు మండిపోతున్నాయి. వార్డులో అన్ని ఫానులు తిరగటం లేదు. రాత్రుల్లు నిద్రపట్టడం లేదు ఎవరికీ.

వీరన్న కడుపును రోజూ అందరు డాక్టర్లూ నొక్కుతూనే వున్నారు. అతనికి రోజురోజుకి కడుపులో నొప్పి ఎక్కువవుతున్నది. వాంతులు కూడా పట్టుకున్నాయి.

ఆరోజు పెద్ద డాక్టరుగారు వచ్చినప్పుడు వినయంగా నమస్కారం చేసి, "మహాప్రభో, కడుపులో నొప్పి, మంటను భరించలేకపోతున్నాను. ఇక ఆపరేషన్ను చేసేయండి, డాక్టరుగారో!" కాళ్లమీద పడినంత చేశాడు.

డాక్టరుగారు సావధానంగా

"ఒరేయ్ వీరన్నా! ఎండలురా. మండిపోతున్నాయి. ఆపరేషన్ చేశానంటే చచ్చిపోతావు. వర్షం పడనీ. చూద్దాం" అంటూ ముందు పేషెంటు దగ్గరకు దాటిపోయారు. మరో పదిరోజులు గడచిపోయాయి.

రోజూ "బాబూ, డాక్టరుగారూ ఆపరేషన్ను చేసేయండి" ప్రాధేయపడుతూనే ఉన్నాడు వీరన్న.

"కంగారు పడకు. ఎండల్లో ఆపరేషన్ను చేశానంటే చచ్చిపోతావు. వర్షం పడనీ చూద్దాం" డాక్టరుగారు చెపుతూనే ఉన్నారు.

ఇంత బాధలోనూ వీరన్న రోజూ సాయంకాలం వార్డు ముందు రావిచెట్టు కిందకు చేరటం, వార్డుబాయిలతో కబుర్లాడటం, ఒక చుట్టపీకను త్రాగటం మానలేదు.

మరుసటిరోజు వీరన్న ముక్కుతో గొట్టంతోనూ, సాధువులు కట్టుకొనే విధంగా తెల్లపంచెను, రెండు అంచులను మెడ వెనుక ముడివేసుకుని ప్రత్యక్షమయ్యాడు. కడుపు ఆపరేషన్ను చేసేటప్పుడు మనిషిని ఆ విధంగా తయారుచేస్తారు.

పక్క మంచం మీద ఉన్న నాకు ఆశ్చర్యం వేసింది. 'వర్షం పడనేలేదు. ఇతనికి ఆపరేషన్ ఏమిటి!'

"ఏం వీరన్నా ఏమిటి సంగతి? వర్షం ఏమీ పడనేలేదే!" అడిగాను.

"అంతా అర్థమయింది బాబు. వార్డుబాయి పైడితల్లి గారంతా చెప్పారు" చెప్పాడు వీరన్న.

వీరన్నను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లాడు వార్డుబాయ్.

అతనికి ఆపరేషను అయిపోయింది. మరి వారంరోజులో ఇంటికి వెళ్లిపోయాడు.

వర్షం ఎక్కడ ఎలా పడిందో వెంటనే అర్థం కాలేదు నాకు.

■